


# కరపత్రం

SINCE 2014

ఆదివారం నవంబర్ 30 2025 | సంపుటి : 2 | సంచిక : 56 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

# ఎనర్జీ ఉంటేనే పెట్టుబడులు

## స్టోరేజీకి అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ

### 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్,నవంబరు29 : గ్రీన్ ఎనర్జీ.. దేశ, ఆయా రాష్ట్రాల అభివృద్ధికి చాలా అవసరమని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ అనే చర్చ జరుగుతుందని అన్నారు. పారిస్ లో జరిగిన అగ్రిమెంట్ ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 50 శాతం తప్పకుండా గ్రీన్ ఎనర్జీ ఉండాలని అగ్రిమెంట్ చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంలో గుర్తు చేశారు. తెలంగాణ భవిష్యత్ విద్యుత్ అవసరాలకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ టార్గెట్‌తో తెలంగాణ ముందుకు పోతుందని భట్టి వెల్లడించారు. తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా తీర్చి దిద్దుతున్నామని, హైదరాబాద్ గ్లోబల్ హబ్ కాబోతోందని భట్టి తెలిపారు.

2047 వరకు మూడు ట్రిలియన్‌ల ఎకానమీకి చేరుకోవాలనేది లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అందుకు కావలసిన పెట్టుబడులకు అవసరమైనది విద్యుత్ అన్నారు. అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి ప్లానింగ్ చేస్తున్నాం.. పవర్ డిమాండ్ రాష్ట్రంలో పదేళ్లుగా పెరుగుతుందని తెలిపారు. తాజాగా ప్రజా భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. 2014 నుంచి విద్యుత్తు 14.2 డిమాండ్ గ్రోత్ ఉందన్నారు.. 2020- 2021 నుంచి 5.44 గ్రోత్, 2024- 25లో 9.8 శాతం గ్రోత్ కనిపించిందని వెల్లడించారు. 2025 నుంచి 34, 35 వరకు తెలంగాణలో 6.4 గ్రోత్ ఉండే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మూసి ప్రక్షాళన.. ఫ్యూచర్ సిటీ.. పెట్టుబడుల ఒప్పందం.. పరిశ్రమలు.. డేటా సెంటర్లతో హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా మారబోతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 8.50 గ్రోత్ ఉండబోతుంది.. 2047 కి లక్ష 39 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం.. తెలంగాణలో 2026 ఏప్రిల్ నాటికి 24769 మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉంది.. వాడే విద్యుత్తులో 50 శాతం గ్రీన్ ఎనర్జీ వాడాలి.. ఎనర్జీ స్టోరేజ్ ప్లాన్ గతంలో లేదు.. పదేళ్ల క్రితం ప్లాన్ చేసుకుని ఉంటే బాగుండేది.. అవసరాలకు అనుగుణంగా ఎనర్జీ స్టోరేజ్ ప్లానింగ్ లేదు.. గ్రీన్ పవర్ ఎనర్జీ స్టోరేజ్‌కి తెలంగాణ అనుకూలం.. పదేళ్లుగా ఇలాంటి ప్రయత్నాలు చేయలేదు.. కానీ ఏపీ మొదలుపెట్టింది.. తెలంగాణలో మాత్రం ఆ ప్రయత్నమే లేదు.. థర్మల్ పవర్ కంటే.. గ్రీన్ ఎనర్జీ వస్తుంది.. కానీ తెలంగాణ అందుకోలేక పోయింది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత.. డిలైట్ లాంటి వాళ్ళను నివేదిక ఇవ్వండి అని అడిగాం.. ఒక్కరోజు బ్లాక్ ఔట్ అయితే 1500 నుండి 2000 కోట్లు నష్టపోతం.. అని వెల్లడించారు.

# రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ దీక్షా దివస్

» సిద్దిపేటలో హరీష్ రావు బైక్ ర్యాలీ » తెలంగాణ భవన్‌లో కెటిఆర్ నివాళి





హైదరాబాద్,నవంబర్29: రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. సిద్దిపేటలో అంబేద్కర్ విగ్రహానికి హరీశ్‌రావు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి,ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్‌లోనూ దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ భవన్‌కు భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళు లర్పించారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు.

మిగతాద్ది 2 లో



మిగతాది 2లో

# హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులు

- 3న సిఎం చేతుల మీదుగా ప్రారంభం
- పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన పొన్నం

సిద్దిపేట,నవంబరు29 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనలో భాగంగా డిసెంబర్ 3వ తేదీన హుస్నాబాద్‌లో పర్యటించనున్నారు. పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు.



# దీక్షా దివస్ పేరుతో డ్రామాలు

– బిఆర్ఎస్ నేతలపై మండిపడ్డ సీతక్క

హైదరాబాద్,నవంబరు29 : బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరోజే దీక్షా దివస్ చేసేవాళ్లని.. అధికారం పోయిన తర్వాత ఇప్పుడు పది రోజుల పాటు దీక్షా దివస్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజలకు పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో ఈ దీక్షా దివస్‌లో చెప్పాలని డిమాండ్ చేశారు.



# ఆత్మత్యాగం చేసిన వారికన్నా మీరు గొప్పా?

» శ్రీకాంతచారి ఆత్మత్యాగం గుర్తుకు రావడం లేదు
» గద్దర్, కోదండరాం, అందె శ్రీ, గూడ అంజయ్యలను ఎందుకు విస్మరించారు
» కెటిఆర్ వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

2లో..

# భూములు అమ్ముకునే కుట్ర

- గ్లోబల్ సమ్మిట్ పేరుతో రియల్ వ్యాపారం
- సిఎం రేవంత్‌పై సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ ఆరోపణలు




2లో..

సిద్దిపేట,నవంబరు29 : గ్లోబల్ సమ్మిట్ పెట్టి భూములు అమ్ముకునేందుకు రేవంత్‌రెడ్డి ప్లాన్ చేస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం రియల్ వ్యాపరమం కోసమే ఈ సమ్మిట్ అని ఆరోపణలు చేశారు. సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ..నవంబర్ 29వ తేదీ ఒక చరిత్ర.. ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజు ఇదని చెప్పుకొచ్చారు. ఉద్యమానికి సిద్దిపేటకు అవినాభావ సంబంధం ఉందని గుర్తుచేశారు. సిద్దిపేటలో జరిగిన ఉద్యోగుల గర్జన ఒక చరిత్ర అని వివరించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష ఒక చరిత్ర.. ఎన్నో త్యాగాలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని పేర్కొన్నారు.'తెలంగాణ రాష్ట్రం కోసం మాజీ సీఎం కేసీఆర్ పోరాడారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కేసీఆర్ పోరాటం గురించి మూర్ఖంగా మాట్లాడుతున్నారు.



2లో..

# అమృత్ పథకం కింద వరంగల్‌కు రూ.874 కోట్లు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

వరంగల్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శనివారం వరంగల్‌లో పర్యటించారు. పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. "వరంగల్ విమానాశ్రయం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నిర్ణయించాం.




2లో..

# ఐబొమ్మ రవి నుంచి కీలక సమాచారం సేకరణ

» ఐ అంటే ఇంటర్నెట్ అని వివరించిన రవి
» మూడు రోజుల కస్టడీ అనంతరం » చంచల్‌గూడకు తరలింపు

హైదరాబాద్,నవంబరు29 ఐబొమ్మ పూర్తిపేరు 'ఇంటర్నెట్ బొమ్మ' అని ఈ కేసులో అరెస్టయిన ఇమంది రవి వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని చెప్పాడు.



# దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన వారు స్మరణీయులు

వీరనారి అవార్డుల ప్రదానోత్సవంలో సిపి సజ్జన్నార్

హైదరాబాద్,నవంబరు29 : దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలను మర్చిపోకూడదని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ అన్నారు. సైనిక్‌పురి ఎంకే రావు మెమోరియల్ హాల్లో శనివారం బొండాడ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన వీరనారి అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.



2లో

# స్లీపర్ బస్సు ప్రమాదాలపై ఆందోళన

- ఆ బస్సులను తక్షణం పక్కన పెట్టేయండి
- రాష్ట్రాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశం

న్యూఢిల్లీ,నవంబరు29 : ఇటీవల స్లీపర్ బస్సుల కారణంగా జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు

» అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం
» ఫేక్ కాల్స్ ఎత్తి సమాచారం ఇవ్వరాదు
» అనుమానం ఉటే 1930కు ఫిర్యాదు చేయాలి

హైదరాబాద్,నవంబరు29 : డిజిటల్ అరెస్ట్ పేరుతో దేశవ్యాప్తంగా పెరుగుతున్న కొత్త రకం సైబర్ మోసాల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ యూనిట్ తాజాగా ప్రజలకు ముఖ్య హెచ్చరిక జారీ చేసింది.




2లో..

# తెలంగాణలో రాజకీయ కోలాహలం

» ముగిసిన తొలిదశ నామినేషన్ల గడువు

హైదరాబాద్,నవంబరు29 : తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. రాష్ట్రంలో తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ప్రారంభమైన విషయం తెలిసిందే. శనివారంతో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. తొలి రోజే సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు సర్పంచి పదవుల కోసం 3,242 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 1,821 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.




మిగతాది 2లో

## స్లీపర్ బస్సు ప్రమాదాలపై ఆందోళన

మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ రంగంలోకి దిగింది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్లీపర్ బస్సులను తక్షణం పక్కనపెట్టేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్‌హెచ్ఆర్‌సీ మార్గదర్శకాల ప్రకారం.. ఏఐఎస్:052, ఏఐఎస్:119 నిబంధనల మేరకు వాహనాలు ఉండేలా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ సమయంలో చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. బస్–బాడీ బిల్డింగ్ సంస్థలు, వాహనాల ఆపరేటర్లు నిబంధనలను అతిక్రమించకుండా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వాహనాల భద్రతకు సంబంధించి సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు (సీఐఆర్‌టీ) మార్గదర్శకాలను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అమలు చేయాలి. ఎమర్జెన్సీ సమయాల్లో అడ్డంకిగా మారే అవకాశం ఉన్న బస్సులోపలి ఏర్పాట్లను తొలగించాలి. అవసరమైన మేరకు బస్సులను రికాల్ చేసి మార్పులు చేసేలా మార్గదర్శకాలు జారీ చేయాలి. మోటార్ వాహన చట్టం, ఏఐఎస్ ప్రమాణాల ఉల్లంఘనలకు బస్సు తయారీదారులతో పాటు అధికారులు కూడా బాధ్యులు అయ్యేలా చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాద ఘటనల్లో బాధితులకు సహాయం, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో 20 మంది మరణించారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్ఆర్‌సీ వద్ద ఫిర్యాదు దాఖలైంది. నిబంధనల అతిక్రమణ కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఇది జీవించే హక్కు ఉల్లంఘనేనని తెలిపారు. దీంతో.. ప్రమాదానికి గల కారణాలపై అధ్యయనం నిర్వహించాలని సీఐఆర్‌టీని ఎన్‌హెచ్ఆర్‌సీ ఆదేశించింది.

## భూములు అమ్ముకునే కుట్ర

మొదటిపేజీ తరువాయి

డిసెంబర్ 9వ తేదీ తెలంగాణ రాష్ట్ర ప్రకటన కేసీఆర్ దీక్ష ఫలితమే. మిలియన్ మార్చ్ మా వంతు.. మిలియన్‌ల కొద్దీ డబ్బు మూటలు కట్టి ఢిల్లీకి పంపుడు కాంగ్రెస్ వంతు. తెలంగాణ ఉద్యమ ద్రోహి రేవంత్‌రెడ్డికి కోదండ రామ్ దగ్గర అయ్యారు. మన నిధులు, మన నీళ్లు మనకు దక్కేలా చేసింది కేసీఆర్. కృష్ణానది నీళ్ల పంపకంపై ఆంధ్రప్రదేశ్.. తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచేలా ట్రైబ్యునల్ ముందు మూడు రోజులుగా వాదిస్తుంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ఈ విషయంపై మాట్లాడటం లేదు. తెలంగాణ రాష్ట్ర మూడు కోట్ల ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరచాలని చూడొద్దు. తెలంగాణ రావడంతోనే మన రాష్ట్రం పచ్చని మాగాణిగా మారి పంటలు పండుతున్నాయి. రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ పోరాట చరిత్ర ఉంటుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం దీక్ష దివస్ జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవ రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఇటీవల మరణించిన ఉద్యమకారుడు అందెశ్రీకి నివాళులు అర్పించారు నాయకులు. అంతకుముందు దీక్షా దివస్ సందర్భంగా సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా నుంచి పొన్నాల బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఆవరణలో ఉద్యమ స్ఫూర్తి పైలాన్‌ను తిరిగి ఆవిష్కరించారు.

## ఆత్మత్యాగం చేసిన వారికన్నా మీరు గొప్పా?

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ సాధనలో అమరవీరుల త్యాగాల కంటే కేసీఆర్ దీక్షను పెద్దదని చెప్పుకోవడం సరైందా అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన దీక్ష నిజంగా ఎలా జరిగిందో ప్రజలందరికీ తెలుసని, ఆ దీక్షను మహోన్నతంగా చూపించడానికి బీఆర్‌ఎస్ ప్రయత్నం చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారి, యాదయ్య, ఇషాన్ రెడ్డి, కానిస్టేబుల్ కిష్టయ్య వంటి అమరవీరుల త్యాగాలు ఎంత గొప్పవో గుర్తు చేశారు. అలాంటి త్యాగాలను పక్కన పెట్టి కేసీఆర్ దీక్షను ప్రోత్సహించడం బీఆర్‌ఎస్ నాయకుల రాజకీయ నాటకమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు చూపుతున్న గౌరవం ప్రత్యేకమని, కేసీఆర్ మాత్రం ఉద్యమకారులను జైల్లో పెట్టిన చరిత్ర కలిగి ఉన్నాడని దయాకర్ అన్నారు. తెలంగాణ ప్రజల రుణం తీర్చుకునే పనిలో రేవంత్ రెడ్డి ఉన్నారని, ఆయన పాలన మానవతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కేసీఆర్ దీక్షపై విమర్శలు చేస్తే కేటీఆర్ ఎందుకు అంత అసహనం చూపుతున్నాడని దయాకర్ ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో పనిచేసిన కాలంలో తెలంగాణ కోసం చిన్నారెడ్డి సంతకాల సేకరణలో మహేష్ గౌడ్ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. సాగరహారం రోజున కేసీఆర్, కేటీఆర్ ఎక్కడ ఉన్నారని కూడా ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నాయకత్వంపై దయాకర్ ఘాటు వ్యాఖ్యలు చేస్తూ.. కాంగ్రెస్ విలీనానికి కేసీఆర్ అవకాశవాద రాజకీయాల వల్లే అడ్డుపడ్డాడని, మిలియన్ మార్చ్‌ను కూడా వ్యతిరేకించాడని తెలిపారు. గద్దర్, కోదండరాం, అందె శ్రీ, గూడ అంజయ్య వంటి ఉద్యమకారులు కేసీఆర్‌కు నచ్చరని అన్నారు. ఉద్యమ సమయంలో మరణించిన శ్రీకాంతాచారిని బీఆర్‌ఎస్ గుర్తు చేసుకోవడం లేదని ఎత్తి చూపారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ ఏర్పడిందని కేసీఆర్ అనేకసార్లు చెప్పినా, అదే సోనియా గాంధీని తర్వాత అవమానించడం అతని స్వభావానికి నిదర్శనమని దయాకర్ చెప్పారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను చంపడానికి కేసీఆర్ ప్రయత్నించాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యి సోనియా గాంధీకి తెలంగాణ బహుమతి ఇచ్చారని, బీఆర్‌ఎస్‌గా మారిన రోజే కేసీఆర్ పార్టీలో తెలంగాణ ఆత్మ చనిపోయిందని విమర్శించారు. అందె శ్రీ అంత్యక్రియల సందర్భంగా రేవంత్ రెడ్డి చూపిన మానవత్వం అందరిని ఆకట్టుకుందని అన్నారు.
కేటీఆర్ రాజీవ్ గాంధీపై వ్యాఖ్యలు చేస్తే సహించబోమని దయాకర్ హెచ్చరించారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో 420 ముద్ర వేసుకున్న నాయకులు మాత్రమే మిగిలారని, సర్పంచ్ ఎన్నికల్లో సెంటిమెంట్ కోసం హడావిడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమం పేరిట రాష్ట్రాన్ని దోచుకున్నవారు బీఆర్‌ఎస్ నాయకులేనని వ్యాఖ్యానించారు.

## డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు

మొదటిపేజీ తరువాయి

ఇలాంటి మోసాలు హైదరాబాద్‌లో కూడా విస్తరిస్తున్నాయి. నకిలీ పోలీస్, సీబీఐ, ఈడీ, కస్టమ్స్, లేదా కోరియర్ కంపెనీల అధికారులుగా నటిస్తూ కాల్ చేసే మోసగాళ్లు, మనీ లాండరింగ్, టెర్రరిజం, నార్కోటిక్స్ కేసులు, ట్రాఫికింగ్ వంటి తీవ్ర నేరాల్లో కేసులు నమోదయ్యాయని చెప్పి ప్రజలను భయపెట్టి డబ్బు లాక్కోవడం ఈ స్కాం కీలక లక్ష్యంగా పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి కాల్స్ ద్వారా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. బాధితులకు వీడియో కాల్ లేదా ఫోన్ ద్వారా అరెస్ట్ చేస్తున్నాం అని నటిస్తూ, ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని, వారెంట్లు జారీ అయ్యాయని నమ్మించి మోసం చేస్తారని హెచ్చరించారు. మోసగాళ్లు తమ కుట్రను బలపరచేందుకు నకిలీ వారెంట్లు, లేఖలు వంటి కట్టుకథల డాక్యుమెంట్లు తయారు చేసి పంపిస్తారు. అనుమానం లేకుండా ఉండేందుకు కుటుంబ ప్రతిష్టకు హాని కలుగుతుందని చెప్పి ఒత్తిడి పెంచుతారు. కేసు నుండి బయటపడాలంటే భారీ మొత్తం డబ్బు సేకరించి సుప్రీం కోర్టుకు డిపాజిట్ చేయాలి అని చెప్పి వెంటనే ట్రాన్స్ఫర్ చేయిస్తారు. కుటుంబ సభ్యులకు చెప్పొద్దని హెచ్చరిస్తూ సోషల్ ఇంజినీరింగ్ పద్ధతులను వినియోగిస్తారని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్ యూనిట్ ప్రజలకు స్పష్టమైన సూచనలు ఇస్తోంది.. డిజిటల్ అరెస్ట్ అనే దాంట్లో ఏమీ లేదు. నిజమైన పోలీసులు ఎప్పుడూ ఫోన్, లేదా వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరు. కాలర్ స్పూఫ్ చేయబడవచ్చు కాబట్టి ఏ అధికారిక కాల్ వచ్చినా వెంటనే నమ్మేయకూడదు. పాన్, ఆధార్, బ్యాంక్ వివరాలు వంటి వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని ఎవరితోనూ పంచకూడదు. అనుమానం వచ్చిన వెంటనే కాల్‌ను కట్ చేసి, కాలర్ ఇచ్చిన నంబర్లకు తిరిగి కాల్ చేయకుండా, స్థానిక పోలీస్ స్టేషన్ లేదా ప్రభుత్వ అధికారిక హెల్ప్‌లైన్‌ద్వారా మాత్రమే ధృవీకరించాలి. మెసేజ్లు, స్క్రీన్‌షాట్లు, కాల్ లాగ్స్ వంటి సాక్ష్యాలను భద్రపరచడం కూడా చాలా ముఖ్యమని అధికారులు తెలిపారు. ఇలాంటి మోసాలు ఎదురైనపుడు వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని లేదా ఫిర్యాదు చేయాలని సూచించారు. తాజా అప్డేట్ల కోసం హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ అధికారిక సోషల్ మీడియా పేజీలను,ఖాతాలను ఫాలో కావాలని చెప్పారు. డిజిటల్ ప్రపంచం వేగంగా మారుతున్న కొద్దీ మోసగాళ్ల పద్ధతులు కూడా అధునాతనంగా మారుతున్నాయి. ఒక్క ఫోన్ కాల్, ఒక్క మెసేజ్ కూడా భారీ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ దీక్షా దివస్

మొదటిపేజీ తరువాయి

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరం మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ వచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడ్డారని పేర్కొన్నారు. తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే అని చెప్పారు. ఖమ్మంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, చంద్రావతి పాల్గొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దీక్షా దివస్ సందర్భంగా సంగారెడ్డిలో అమరవీరులకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్ ఇతర బీఆర్‌ఎస్ నాయకులు నివాళులర్పించారు.

## తెలంగాణలో రాజకీయ కోలాహలం

మొదటిపేజీ తరువాయి

రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 4901 నామినేషన్లు దాఖలు. రెండో రోజు వార్డు మెంబర్ల స్థానాలకు 9643 నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు. రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు 8198 నామినేషన్లు, 11502 వార్డు మెంబర్ నామినేషన్లు దాఖలు అయినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 189 మండలాల్లోని 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించనున్నది. 30వ తేదీన నామినేషన్ పత్రాల పరిశీలన చేపడతారు. డిసెంబర్ 3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. అదే రోజు పోటీలో ఉన్న తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు చేపట్టి వార్డు సభ్యులు, సర్పంచుల ఫలితాలను వెల్లడిస్తారు.

## అమృత్ పథకం కింద వరంగల్‌కు రూ.874 కోట్లు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

ఇక్కడి నుంచి ముందుగా ఏటీఆర్ విమానాలు నడపాలని భావిస్తున్నాం. ఆ తర్వాత పౌరుల స్పందన బట్టి మరిన్ని సర్వీసులు నడుపుతాం. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. అమృత్ పథకం కింద వరంగల్ జిల్లాకు రూ.874 కోట్లు మంజూరయ్యాయి. కాజీపేట రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పాం. హృదయ్ పథకం కింద పురాతన ఆలయాల పునరుద్ధరణకు కేంద్రం నిధులు ఇచ్చింది. రామప్ప ఆలయం అభివృద్ధి కోసం కేంద్రం రూ.146 కోట్లు ఖర్చు చేస్తోంది" అని కిషన్‌రెడ్డి వివరించారు.

## దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన వారు స్మరణీయులు

మొదటిపేజీ తరువాయి

ఇండో పాక్ యుద్ధంలో అనేకమంది అమరులయ్యారని, వారి త్యాగాలను స్మరించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా 51 మంది మాజీ సైనిక ఉద్యోగులు, మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో బొండాడ గ్రూప్ ఛైర్మన్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్ పోలీసు శాఖ మరో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సీఐటీ సెంట్రల్ ఇన్వెస్ట్ గేషన్ టీమ్‌ను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ సన్నాహాలు చేస్తున్నారు. సెన్సేషనల్ కేసులతో పాటు కీలక కేసులను సీఐటీకి బదిలీ చేసేలా చర్యలు తీసుకోనున్నారు. సాధారణ కేసులతో సంబంధం లేకుండా సీఐటీ టీమ్ ద్వారా కేసుల దర్యాప్తు వేగవంతం అవుతుందని భావిస్తున్నారు పోలీస్ ఉన్నతాధికారులు. కేసు దర్యాప్తు దగ్గర నుంచి కోర్టులో ఛార్జ్ షీట్స్, ట్రయల్ వరకు సీఐటీ టీమ్ మానిటర్ చేసే విధంగా అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

## ఐబొమ్మ రవి నుంచి కీలక సమాచారం సేకరణ

మొదటిపేజీ తరువాయి

మరో వెబ్‌సైట్‌కు బలపం అని పేరు పెట్టాలని అనుకున్నట్లు తెలిపాడు. డొమైన్‌లో సాంకేతిక సమస్యతో 'ఎల్' అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు వెల్లడించాడు. శనివారంతో నిందితుడి రెండో విడత కస్టడీ పూర్తయ్యింది. ఇందులో భాగంగా పోలీసులు అతడిని 3 రోజులపాటు ప్రశ్నించి.. కీలక సమాచారం సేకరించారు. పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి పోలీసులకు రవి వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాల్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవేనని చెప్పాడు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. ఈ క్రమంలో అతను పోలీసుల ముందు సంచలన విషయాలు వెల్లడించాడు. రవి మెయిల్ అకౌంట్స్ రిట్రైవ్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు.. ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్స్‌లో 21వేలకు పైగా సినిమాలను గుర్తించారు. పైరసీ వెబ్‌సైట్స్ నుంచి సినిమాలు రికార్డింగ్ చేసినట్టు గుర్తించారు. ఓటీటీలో వచ్చే సినిమాలను కూడా రికార్డింగ్ చేసినట్టు రవి అంగీకరించినట్లు తెలిసింది. రికార్డింగ్ చేసిన ఆడియోలు, వీడియోల క్వాలిటీ పెంచేందుకు.. కరేబియన్ దీవుల్లో ఔట్‌సోర్సింగ్ వారితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి రవి పోలీసులకు వివరించాడు. తాను నిర్వహించిన వెబ్‌సైట్లపై కూడా క్లారిటీ ఇచ్చాడు. ఐబొమ్మ పూర్తిపేరు ఇంటర్నెట్ బొమ్మగా వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని.. బొమ్మను ఇంటర్నెట్‌లో చూపిస్తున్నందుకే ఐబొమ్మ అని పేరు పెట్టినట్లు చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం పేరు పెట్టాలని భావించినట్లు తెలిపాడు. అయితే డొమైన్‌లో సాంకేతిక సమస్యతో ఒ అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు వివరించాడు. తాను అప్‌లోడ్ చేసిన సినిమాలన్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవే అని రవి అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

## దీక్షా దివస్ పేరుతో డ్రామాలు

మొదటిపేజీ తరువాయి

అది చెపివుంటే ప్రజలు గమనించే వారని అన్నారు. రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేసిందన్నారు. ఈ విజయాలను ప్రజలకు వివరించేందుకు తాము 10 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. వీటిని అడ్డుకునే కుట్రతోనే
దీక్షా దివస్ పేరుతో బిఆర్‌ఎస్ నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. తెలంగాణ వచ్చాక వందల రెట్లు లబ్ది పొందింది కేసీఆర్ కుటుంబమేనని అన్నారు. అమరులు పోయారు ..వారి కుటుంబాలు పోయాయని అన్నారు. కానీ బిఆర్‌ఎస్ నేతలు మాత్రం కోట్లకు పడగలెత్తారని మండిపడ్డారు. ఆ పార్టీ దగ్గర అధికారం మాత్రమే లేదు. కోట్లాది రూపాయలు ఉన్నాయి. అధికారం ఉంటేనే ప్రజల్లో ఉంటాం.. లేకపోతే బయటకే రావొద్దని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీక్షా దివస్ పేరుతో చేస్తున్న డ్రామాలను తెలంగాణ ప్రజలు విశ్వసించరని మంత్రి అన్నారు. కొవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చాలంటూ 2021లో ఇందిరా పార్క్ వద్ద సీతక్క దీక్ష చేపట్టారు. దీంతో ఆమెపై అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. కేసు విచారణలో భాగంగా నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు సీతక్క హాజరయ్యారు.

## హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులు

మొదటిపేజీ తరువాయి

అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. సీఎం పర్యటన దృష్ట్యా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో హుస్నాబాద్ పట్టణ శివారులోని ఏనె వద్ద మైదానంలోని బహిరంగ సభ ప్రాంగణాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. పోలీసులకు మంత్రి పొన్నం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ప్రజాపాలన ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన అభివృద్ధి, ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులపై ఈ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతారని చెప్పుకొచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన అనేక అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల సహకారంతో మిగిలిన సమస్యలను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిష్కరించి ముందుకెళ్లే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. నాలుగు జిల్లాల మధ్యలో కేంద్రంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి సభకు హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## దీక్షా దివస్ అంటే స్వాతంత్ర్య దినోత్సవమే తెలంగాణ వచ్చేదాకా దీక్ష విరమించని కెసిఆర్

### – భువనగిరి దీక్షా దివస్‌లో మాజీమంత్రి జగదీశ్ రెడ్డి

కేసీఆర్ నా శవయాత్ర.. తెలంగాణ జైత్ర యాత్ర ఒకేసారి జరగాలి అన్నారని.. అప్పటిదాకా దీక్ష విరమించేది లేదని పట్టుబట్టారని అంటూ ఆనాటి ఘటనలను మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి గుర్తు చేశారు. ఆనాటి ఆంధ్రా పోలీస్‌లు, నాయకులు ఎన్నో జిమ్మిక్కులు చేశారని.. అయినా అన్నింటిని ఛేదించి తెలంగాణ సాధించామన్నారు.భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన దీక్షా దివస్ వేడుకల్లో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 29 దీక్ష దివస్ మనందరికీ స్వాతంత్ర్యం తెచ్చిన రోజు అని తెలిపారు. దేశానికి ఆగస్టు 15 ఎలాగో, మనకు నవంబర్ 29 అలాగేనన్నారు. కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి, మొక్కవోని పట్టుదలతో దీక్ష చేసి, ఢిల్లీ మెడలు వంచిన రోజనరి పేర్కొన్నారు. కేసీఆర్ దీక్ష చేసిన 11 రోజులు ఒక్కోక్షణం ఒక్కో భయంతో గడిపామని.. తమ నేతకు ఏమైనా అయితే తెలంగాణ ఎటు పోతుందో అని కన్నీరు పెట్టామన్నారు. కే హైదరాబాద్ లేకుండా తెలంగాణ అన్నారని.. అప్పుడు కేసీఆర్ గుండె లేని మనిషి వున్నా లేనట్లే హైదరాబాద్‌తో కూడిన తెలంగాణనే కావాలని పట్టుబట్టారన్నారు. ఢిల్లీ గడగడ లాడిపోయిందని.. తెలంగాణ బెబ్బులిలా నిలబడి బరిగీసి కొట్లాడింది.. లక్ష్యం ముద్దడినం అంటూ గుర్తు చేశారు. కేసీఆర్ అంటే తెలంగాణ తెచ్చిన ముఖ్యమంత్రి.. తెలంగాణ కోసం చావు అంచుల దాకా, పేగులు తెగే దాకా కొట్లాడిన ఉక్కు మనిషి కేసీఆర్ అన్నారు. అలాంటి కేసీఆర్‌పై ఇప్పుడు కాంగ్రెస్ దొంగలు అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని.. తస్మాత్ కొడుకుల్లారా.. కేసీఆర్‌పై నోరు జారితే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. కేసీఆర్ తెలంగాణ సమాజానికి దేవుడని.. అందరి గుండెల్లో గూడు కట్టుకున్న మహానేత మా కేసీఆర్ అన్నారు. కేసీఆర్ సైనికులుగా మేమంతా తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి పని చేశామని.. ఇప్పుడు వస్తున్న 24 గంటల కరంట్, మంచి నీళ్లు, పాడి పంటలు, తెలంగాణ ఆదాయం అన్ని అన్ని కేసీఆర్ సాధించినవేనన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు అనుభవిస్తున్న పదవులు అన్ని కేసీఆర్ తెచ్చినవేనని.. కేసీఆర్‌పై కుట్రలు చేయని పార్టీ లేదని.. ఎప్పుడు పిల్లి శాపనార్థాలు పెడతారని విమర్శించారు. ఇప్పుడు కూడా కేసీఆర్ ఆరోగ్యం బాగాలేదని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని.. కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. తెలంగాణ అభివృద్ధి జరిగేది ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమని.. తెలంగాణ వాదులపై తుపాకీ ఎక్కుపెట్టిన దుర్మాగుడు రేవంత్.. ఆయన పాలనే ఇప్పుడు నడుస్తుండడం దౌర్భాగ్యమన్నారు. తెలంగాణలో లాఠీ, లూఠీ పాలన నడుస్తుందని.. తెలంగాణ కాంగ్రెస్ విముక్త రాష్ట్రంగా అయ్యేంత వరకు పోరాటం చేద్దామంటూ జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ స్థలంలో విల్లాలు కట్టి అమ్మకం రెయిన్‌బో మెడోస్ నిర్మాణ సంస్థ మోసం

సంగారెడ్డి జిల్లాలోని కిష్టారెడ్డిపేటలో రెయిన్‌బో మెడోస్ నిర్మాణ సంస్థ పాల్పడిన అతిపెద్ద రియల్ ఎస్టేట్ మోసం తాజాగా వెలుగు చూసింది. ప్రభుత్వ స్థలంలో విల్లాలను కట్టి 40కోట్లకు మోసం చేసింది. రెవెన్యూ అధికారులు ఈ తతంగాన్ని చోద్యం చూశారే తప్ప నిలదీయలేదు. హెచ్‌ఎండీఏ ఆమోదించిన లేఅవుట్‌గా నమ్మించి, పలు సర్వే నంబర్లలో ఏకంగా 40 విల్లాలను అక్రమంగా నిర్మించి అమాయక ప్రజలకు విక్రయించారు. ఇటీవల రెవెన్యూ అధికారుల సర్వేలో ఈ విల్లాలన్నీ సర్వే నంబర్లు 198, 199, 204, 208, 210లలోని ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు నిర్ధారణ కావడంతో, కొనుగోలు దారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విల్లాల కోసం ఒక్కో కుటుంబం రూ. 90 లక్షల నుంచి రూ. 1.1 కోటి వరకు వెచ్చించింది. మొత్తంగా, బాధితులు సుమారు రూ. 40 కోట్లకు పైగా పెట్టుబడిని నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ మోసం వెలుగులోకి రాగానే, తమకు న్యాయం చేయాలంటూ బాధితులు ఆందోళనకు దిగారు. గతంలోనే కొందరు బాధితులు అనుమానం వ్యక్తం చేసినప్పుడు, ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే తాము తీసుకున్న డబ్బు మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని రెయిన్‌బో మెడోస్ సంస్థ లిఖితపూర్వక ఒప్పందం (ఓక్షజ) ఇచ్చింది. అయితే, ఇప్పుడు అది ప్రభుత్వ స్థలం అని నిర్ధారణ కావడంతో, నిర్మాణ సంస్థ స్పందించకుండా ముఖం చాటేయడంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తమ ఇళ్లు ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు తేలడంతో, హెచ్‌ఎండీఏ, ఎంఆర్ఓ, ఆర్‌డిఓ వంటి ప్రభుత్వ వ్యవస్థలు ప్రభుత్వ భూమిని తనిఖీ చేయకుండా ఈ నిర్మాణాలకు ఎలా అనుమతి ఇచ్చాయని
బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ తమను మోసం చేసిందని ఆరోపిస్తూ, సంస్థ భాగస్వాములైన ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి ప్రసాద్, ఎన్.వి. నరసింహారావులపై క్రిమినల్ కేసు నమోదు చేసి, తమకు అయిన నష్టాన్ని పూర్తిగా తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం, బాధితులు అమీన్‌పూర్ పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారంపై అధికార యంత్రాంగం ఎలా స్పందిస్తుందో, బాధితులకు న్యాయం జరుగుతుందో లేదో తెలియాల్సి ఉంది.

## ఐదేళ్లలో ఒక్క డిఎస్సీ నిర్వహించని ఘనత

### – వైకాపా అధినేత జగన్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి

గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రిక్రూట్‌మెంట్ కూడా జరగలేదని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ విమర్శించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై శ్రీనివాస్ వర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో భీమవరం ఎస్ఆర్కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ వర్మ, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో దేశంలో ఒక్క డీఎస్సీని నిర్వహించని ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైసీపీ ప్రభుత్వమేనని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పెద్ద ఎత్తున పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. అనకాపల్లిలో నిర్మించబోయే ఆర్ఎస్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ద్వారా 90 వేల మంది నిరుద్యోగులకు త్వరలో ఉద్యోగాలు రానున్నాయని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు.

## కేసీఆర్ దీక్ష ఫలితమే తెలంగాణ రాష్ట్రం

### - బాస్కర్ యాదవ్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా గ్రంధాలయ మాజీ ఛైర్మన్ బాస్కర్ యాదవ్ మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ నవంబర్ 29న చేపట్టిన దీక్ష ఫలితంగానే రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. మేడ్చల్ పట్టణంలో శనివారం దీక్షా దివస్ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన పోరాటం, ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆయన పాత్రను యాదవ్ కొనియాడారు. రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ సారధ్యంలో అభివృద్ధి జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## గుండ్లపోచంపల్లిలో బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
గుండ్లపోచంపల్లిలోని సన్ ఫ్లవర్ వేదిక్ స్కూల్ లో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14 రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ చాంపియన్ క్రీడలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి విద్యార్థులు పాల్గొంటున్నారు. ఇక్కడ ఎంపికైన 12 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల విద్యాధికారి శంకరయ్య, ఎస్ జి ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిష్టయ్య, టీ జి పాట రాష్ట్ర జనరల్ సెక్రటరీ నాగరాజు గౌడ్, సన్ ఫ్లవర్ వేదిక్ స్కూల్ ప్రిన్సిపల్ కల్పణ ప్రసార, స్కూల్ డైరెక్టర్ సరిత కుమార్, బాస్కెట్ బాల్ కోచ్ లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుప్త నిధుల కోసం తవ్వకాలు

### - ఎనిమిది మంది అరెస్ట్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుప్త నిధులు ఉన్నాయని నమ్మి తవ్వకాలు జరుపుతున్న ఎనిమిది మందిని పోచారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోచారం ఇన్ఫోసిస్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో ఈ తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం అందుకున్న పోలీసులు, గుప్తనిధుల కోసం గుంతలు తవ్వుతున్న గడపల్లి మహేష్ (33), గొలుసుల అజయ్ (19), మిరియాల ప్రశాంత్ (19), అమ్మన మంచి హర్ష (24), బోనగోని శివ (21), ఉర్సు శివ (21), బొక్క విష్ణువర్ధన్ రెడ్డి (20), బిగుడం అరవింద్ (30) అనే ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు.

## కొడుకు, అల్లుడుతో కలిసి భర్త ను చంపిన భార్య



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ లో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. భర్త అంజయ్య (52)ను భార్య, కొడుకు, అల్లుడు కలిసి హత్య చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. మద్యం సేవించి ఇంట్లో గొడవ చేస్తున్నాడని హత్య జరిగినట్లు మృతుడి పెద్ద కుమారుడు ఉదయ్ కిరణ్ ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కోరుట్ల ఎమ్మెల్యేను కలిసిన DM &HO



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్‌ను, డిప్యూటీ డీఎంహెచ్ఓగా పదోన్నతి పొందిన డా. జైపాల్ రెడ్డి శనివారం కోరుట్లలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే సంజయ్ డా. జైపాల్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## కోరుట్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ బోణి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
కోరుట్ల నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సర్పంచ్ ఎన్నికల్లో బోణి కొట్టింది. ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి కానుగంటి లాస్య రాజశేఖర్ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ దాఖలుకు చివరి రోజున సాయంత్రం 5 గంటల వరకు ఒకే నామినేషన్ దాఖలు కావడంతో అధికారులు లాస్యను ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ ఎన్నికతో బీఆర్ఎస్ పార్టీకి నియోజకవర్గంలో శుభారంభం లభించింది.

## కోరుట్ల సాయి బాబా ఆలయంలో దత్త జయంతి



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని సాయి బాబా దేవాలయంలో దత్త జయంతి, గురు చరిత్ర పారాయణం సప్తహ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శనివారం ఆంజనేయస్వామికి 1108 వడలు, 1108 తమలపాకులు, సింధూరంతో సహస్రనామార్చన నిర్వహించారు. నిర్వాహకులు, ఆలయ అర్చకులు సిరిపురం వినయ్ శర్మ మాట్లాడుతూ, గ్రహచార బాధలు, దృష్టి దోషాలు, అభిచారిక ప్రయోగాలు వంటి వాటి నివారణకు తేనెతో స్వామి వారికి అభిషేకం చేసి, ఆ ప్రసాదాన్ని స్వీకరిస్తే దోషాలు తొలగిపోతాయని తెలిపారు. అనంతరం పారాయణం చేయు భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## ఏడేళ్ల తర్వాత మల్లాపూర్‌లో సర్పంచ్ ఎన్నికలు




**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
కోరుట్ల మల్లాపూర్ మేజర్ గ్రామపంచాయతీలో ఏడేళ్ల తర్వాత సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. 2019లో జరిగిన ఎన్నిక వివాదాస్పదం కావడంతో రద్దు చేయబడింది. అప్పటి నుండి ప్రత్యేక అధికారి పాలన కొనసాగుతోంది. మూడు ప్రధాన పార్టీల నుంచి నామినేషన్లు దాఖలు కావడంతో, ఎవరు గెలిచినా నిలిచిపోయిన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తారని, గ్రామంలో అభివృద్ధి వేగవంతం అవుతుందని గ్రామస్థులు ఆశిస్తున్నారు.

## దీక్షా దివస్ చారిత్రాత్మక రోజు..

- తెలంగాణ అంకురార్పణకు బీజం
- కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాధించుకున్నం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**కరపత్రం ప్రతినిధిం మంథని నవంబర్ 29**
ఆనాడు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటిపెట్టిన దీక్షాదివస్ చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. దీక్షాదివస్ సందర్భంగా మంథని పట్టణంలోని ప్రభుత్వ సామాజిక వైద్యశాలలోని రోగులకు బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అంకురార్పణ, ఆవిర్భావానికి, అభివృద్ధికి దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలువడానికి దీక్షాదివస్ కారణమని, ఆనాడే బీజం పడిందన్నారు. దీక్షాదివస్‌తోనే రాష్ట్రంలోని ఉద్యమకారులు, సబ్బండవర్గాలు ఒక్కటై ముందుకు సాగామని, కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాధించుకున్నామని ఆయన తెలిపారు. ఆనాడు తెలంగాణాను వ్యతిరేకించినోళ్లు ఈనాడు తెలంగాణ రాష్ట్రంలో గొప్ప పదవులు అనుభవిస్తున్నారని, అందుకు కారణం తెలంగాణ సృష్టికర్త, తెలంగాణ గాంధీగా ఉన్న కేసీఆర్ కారణమని చెప్పచ్చున్నారు. తెలంగాణ లేకపోతే ఈనాడు రాష్ట్రంలో కాంగ్రెస్ అనేది ఉండేది కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రతి ఏటా దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ విజయశ్రీ -రజాలి



**కరపత్రం ప్రతినిధి నవంబర్ 29**
ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఉపశమనంగా సీఎం సహాయనిధి చెక్కులు దోహదం చేస్తున్నాయి. శనివారం హనుమకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, నేతలతో కలిసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి 30 మంది లబ్ధిదారులకు రూ.11,59,500 లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. చికిత్స, ఖర్చులు, అత్యవసర ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, ఆర్థిక భారాలు వంటి కారణాలతో దరఖాస్తు చేసిన వారికి ప్రభుత్వం ఈ సహాయాన్ని మంజూరు చేసిందని, సీఎం రేవంత్ రెడ్డి లబ్ధిదారుల ప్రతి ఫైల్ ను వ్యక్తిగతంగా పరిశీలించి త్వరితగతిన మంజూరు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా కార్పొరేటర్ విజయశ్రీ-సయ్యద్ రజాలి మాట్లాడుతూ.. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పశ్చిమను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తూ అగ్ర భాగాన నిలబెడుతున్నారని, కోరిన ప్రతి పనిని మంజూరు చేస్తూ.. జననాయకుడిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోట వెంకన్న, జిల్లా నేతలు, నాయకులు, మహిళా నాయకురాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై మార్గదర్శక వర్క్‌షాప్ ప్రారంభం




**కరపత్రం ప్రతినిధి వరంగల్, నవంబర్ 29**
వక్ఫ్ ఆస్తుల సురక్షిత రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించేందుకు ముస్లిం లీగల్ టీమ్, ఇంటలెక్చువల్స్ టీమ్ వరంగల్ ఆధ్వర్యంలో రెండు రోజుల మెంటరింగ్ వర్క్‌షాప్ శనివారం ఉదయం 11 గంటలకు ఖాజీపేట దర్గా ప్రాంగణంలో ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వక్ఫ్ 'ఉమిడ్ పోర్టల్' ద్వారా వక్ఫ్ ఆస్తుల ఆన్‌లైన్ నమోదు విధానంపై పౌరులకు పూర్తి మార్గదర్శకత్వం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని హజ్రత్ సయ్యద్ షా గులాం అఫ్జల్ బయాబానీ (ఖుస్రో పాషా పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్, తెలంగాణ డిస్ట్రిక్ట్ దర్గా అసోసియేషన్ అధ్యక్షులు పాల్గొని మాట్లాడారు.వారి ప్రకారం,వరంగల్‌లోని మసీదులు, ఈద్గాలు, దర్గాలు, మఠాలు, కబరస్తాన్లు, మదరసాలు, విద్యాసంస్థలు అన్ని వక్ఫ్ సంబందిత సంస్థలు ఉమిడ్ పోర్టల్‌లో తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.2025 చివరి తేదీగా నిర్ణయించబడినందున, సంబంధిత బాధ్యులంతా తమ వద్ద ఉన్న పత్రాలతో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. పవిత్రమైన వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర అత్యంత కీలకమని వారు పేర్కొన్నారు.వివరాలకు,హెల్ప్‌లైన్‌లు: 98492 68124,98490 17732, సంప్రదించ వచ్చిన తెలిపారు.

## సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని

» క్యాంపు కార్యాలయంలో 30 మంది లబ్ధిదారులకు రూ.11,59,500/-



**కరపత్రం ప్రతినిధి నవంబర్ 29**
సీఎం సహాయ నిధి కింద ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఉపశమనంగా ప్రభుత్వం అందిస్తున్న సహాయంలో భాగంగా.., శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 30 మంది లబ్ధిదారులకు రూ.11,59,500 చెక్కులను అందజేశారు. చికిత్స ఖర్చులు, అత్యవసర ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, ఆర్థిక భారాలు వంటి కారణాలతో దరఖాస్తు చేసిన వారికి ప్రభుత్వం ఈ సహాయాన్ని మంజూరు చేసిందని. లబ్ధిదారుల ప్రతి ఫైల్‌ను వ్యక్తిగతంగా పరిశీలించి, త్వరితగతిన మంజూరు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.ప్రజలకు ఏ కష్టమొచ్చినా ప్రభుత్వం అండగా నిలబడటమే ముఖ్యమని చెప్పారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, గృహ భద్రత వంటి అంశాల్లో చిన్న సహాయం కూడా పెద్ద మార్పు తీసుకురాగలదని అన్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల పరిష్కారానికి మరింత శ్రద్ధ చూపుతున్నామని, అవసరమైన వారందరికీ ఈ నిధి సకాలంలో చేరేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
ఆదివారం నవంబర్ 30 2025

# రైతన్న మీకోసం లో మనోజ్ రెడ్డి



**కరపత్రం ప్రతినిధి,తూ.గో.జిల్లా (అనపర్తి/పెదపూడి) :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు సూత్రాలను పాటిస్తే రైతులందరికీ మంచి భవిష్యత్తు ఉంటుందని అంతేకాక వారి ఆదాయం బాగుంటుందని యువనేత నల్లమిల్లి మనోజ్ రెడ్డి అన్నారు. శనివారం పెదపూడి లో రైతన్న మీకోసం లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే అన్ని సౌకర్యాలను స్వయంగా రైతుల ఇంటికి వెళ్లి మనోజ్ రెడ్డి వివరించి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మనోజ్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు రైతులందరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ చైర్మన్ జుత్తుగ సూర్యకుమారి, పలువురు ఎన్డీఏ నేతలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలు ఉద్యోగ విరమణ అభినంద సభ



**కరపత్రం ప్రతినిధి నవంబర్ 29**
ఈరోజు షాబాద్ మండలంలో బాలికల ఉన్నత పాఠశాల షాబాద్ లో ఆంగ్ల ఉపాధ్యాయురాలు శ్రీ లక్ష్మీ మేడం ఉద్యోగ విరమణ అభినందన సభలో పాల్గొని అభినందనలు తెలిపిన రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు సామ మహేందర్ రెడ్డి ,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీ లక్ష్మీ మేడం తన 25 సంవత్సరాలు సర్వీసులో ప్రభుత్వ బడులలో చదువుకునే పేద విద్యార్థుల ఔన్నత్యం కొరకు పాటుపడి,వారికి చక్కటి విద్యను అందిస్తూ, ముఖ్యంగా ఆంగ్ల సబ్జెక్టును గ్రామీణ ప్రాంతాలలోనీ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దినారు. మేడం దగ్గర చదువుకున్న విద్యార్థులు నేడు అనేక రంగాల్లో ఉన్నత స్థానాలలో ఉద్యోగాలలో స్థిరపడడం జరిగిందన్నారు, శ్రీలక్ష్మి మేడం గారి సేవలు మరువలేనివని,చాల అమోఘమైనవని వారి సేవలను కొనియాడుతూ, పదవి విరమణ అనంతర జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ వారికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపి సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు డేవిడ్ రెడ్డి ,ప్రధాన కార్యదర్శి కృష్ణ ,మరియు కాజ పాష ,యాదయ్య ,మర్పల్లి అశోక్ ,కృష్ణ , సింహాద్రి నాయుడు,గోవింద్ మాధవ రెడ్డి పాల్గొనడం జరిగింది.

# నేడు అల్లాపూర్ డివిజన్ గాయత్రీ నగర్ లో సమస్యల పరిష్కారానికై బండి రమేష్ పాదయాత్ర...

**కరపత్రం ప్రతినిధి కూకట్పల్లి**
కూకట్ పల్లి నియోజకవర్గంలో టి పి సి సి ఉపాధ్యక్షులు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆదివారం ఉదయం 6:30 గంటలకు పాదయాత్ర చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తెలియజేశారు. ప్రజా సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తూ ప్రజాపాలనలో ప్రజలను బాగా స్వాములను చేస్తూ సంక్షేమ పథకాలు చేరవేస్తూ ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పాలనను మరింత పటిష్టం చేసేందుకు అల్లాపూర్ డివిజన్ లోని గాయత్రీ నగర్ లో స్థానిక వివిధ సమస్యల పై పాదయాత్ర కార్యక్రమంలో పాల్గొంటారు అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అద్యక్షులు, మార్కెట్ కమిటీ మెంబర్స్, మరియు టెంపుల్ కమిటీ మెంబర్స్ ,బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు , యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు సేవ్ దళ్ నాయకులు అన్ని విభాగాల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



# లక్కీ డ్రాలో కారు గెలుపొందిన పాత్రికేయుడు వి6 లక్ష్మణ్ ప్రసాద్...

## - నూతన కారును డ్రైవ్ చేసి ప్రారంభించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు...

**కరపత్రం ప్రతినిధి కూకట్పల్లి**
కూకట్పల్లి ప్రాంతానికి చెందిన వి6 లో పనిచేస్తున్న సీనియర్ పాత్రికేయులు లక్ష్మణ్ ప్రసాద్ కు ఇటీవల లక్కీ డ్రా ద్వారా నూతనంగా కారును గెలుపొందారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గారిని మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో లక్ష్మణ్ ప్రసాద్ కలిశారు. ఈ సందర్భంగా తన వాహనాన్ని డ్రైవింగ్ చేయాలని కోరగా వడ్డేపల్లి రాజేశ్వరరావు గారు కారును నడిపించి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ ప్రసాద్ మాట్లాడుతూ నిత్యం నియోజకవర్గ ప్రజల మధ్య ఉండే నాయకులు, నాకు అత్యంత ఇష్టమైన బిజెపి నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు గారి చేతుల మీదుగా వాహనాన్ని నడిపి ప్రారంభించుకోవడం నాకు ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

# బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశ్వంత్ కుమార్ ఆధ్వర్యంలో జె ఎన్ టి యు సి వద్ద దీక్ష దివాస్...

**కరపత్రం ప్రతినిధి కూకట్పల్లి**
తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' నినాదంతో 2009 నవంబర్ 29న ప్రారంభించిన ఆమరణ దీక్ష, ఉద్యమ గతిని మలుపు తిప్పింది. సరికొత్త చరిత్రకు నాంది పలికింది. తెలంగాణ ఏర్పాటుకు బాటలు వేసింది.'రానే రాదు, కానే కాదు' అన్న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును సబ్బండ వర్గాలను ఏకం చేసి సుసాధ్యం చేసి చూపిన ఘన చరిత కేసిఆర్ ది
నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష సాధనకు అలుపెరగని పోరాటం చేసిన చరిత్ర కేసీఆర్ ది పదవులే కాదు, తెలంగాణ కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసేందుకు సిద్ధపడ్డ ధీరత్వం కేసీఆర్ ది తెలంగాణ అజరామర చరిత్రకు వీరోచిత సంతకం కేసీఆర్. నాలుగు కోట్ల ప్రజల్లో మార్మోగే 'జై తెలంగాణ' అనే రణ నినాదం కేసీఆర్




నవంబర్ 29న కేసీఆర్ దీక్ష లేకుండా డిసెంబర్ 9 ప్రకటన లేదు. డిసెంబర్ 9 ప్రకటన లేకుండా తెలంగాణ రాష్ట్రం లేదు. దశాబ్దాల పోరాటంతోనే తెలంగాణ సిద్ధించింది తప్ప పాలకుల దయాదాక్షిణ్యాలతో కాదన్నది అక్షర సత్యం.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన కెసిఆర్ దీక్షా కాలం ఉద్యమ జ్ఞాపకాలు నా గుండెలో పదిలంగా ఉన్నాయి. దీక్షా దివాస్ సందర్భంగా శివానంద హాస్పిటల్ లో పండ్ల పంపిణీ చేయడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు కూకట్పల్లిలో ఉన్న జోహార్ లాల్ నెహ్రూ టెక్నోలజికల్ యూనివర్సిటీ జేఎన్టీయూహెచ్ విశ్వవిద్యాలయంలో దీక్ష దివాస్ కార్యక్రమం చేపట్టడం జరిగింది. దీనికి టి ఎస్ టి ఎస్ మాజీ చైర్మన్ పార్టీ మీద జగన్మోహన్ రావు దీక్షకు సంఘీభావం తెలపడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య నాయకులు కళ్యాణ్ అక్షయ్ చైతన్య యాదవ్ మహేష్ సంతోష్ యాదవ్ దుర్గా అజయ్ శ్రవణ్ రమేష్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 1న ముదిరాజ్ మహాసభ తలపెట్టిన నిరసన కార్యక్రమం వాయిదా

**- ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేసిన కాసాని వీరేష్ ముదిరాజ్**
**- మండలాల వారిగా అమరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతి సభలు నిర్వహించాలని పిలుపు.**

**కుత్బుల్లాపూర్ నవంబర్ 29 కరపత్రం ప్రతినిధి**
డిసెంబర్ 1న బీసీ"ఏ" సాధన కోసం ఇచ్చిన పిలుపును అఖిల భారత కోలీ సమాజ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్ వాయిదా వేశారు.
ఈ మేరకు ఆయన శనివారం హైదరాబాదులోని ఓ ప్రయివేట్ హొటల్లో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఈ వాయిదా విషయాన్ని ప్రకటించారు.
పంచాయితీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావించడం ఎన్నికల కమిషన్ ఎన్నికల తేదీని ఖరారు చేయడం రాష్ట్రంలో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి.
నిరసన కార్యక్రమాలకు అడ్డంకులు కూడా



తలెత్తాయి.అందుచేత డిసెంబర్ 1న ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు హైవే దిగ్బంధం నిరసన కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్లు వీరేష్ ప్రకటించారు.ఈ సందర్భంగా వీరేష్ మాట్లాడుతూ ... నేను ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్ సోదరులు కార్యక్రమం నిర్వహించడానికి సన్నద్ధమయ్యారని అయినప్పటికీ మనలోని మన సోదరులు, బంధుమిత్రులు, ముదిరాజ్ నాయకులు ఎంతోమంది ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని సంకల్పించారు.
వారి విజయం మనందరి బాధ్యత అని మన సంఘటిత మద్దతు వారికి అత్యంత కీలకం అన్నారు. ఈ నేపథ్యంలో వారి అభ్యర్థన, సూచన మేరకు డిసెంబర్ 1న జరగాల్సిన హైవే దిగ్బంధం, ఇతర నిరసన కార్యక్రమాలను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.
ఎన్నికల నియమావళి పూర్తయిన వెంటనే సమావేశం నిర్వహించి,భవిష్యత్తులో మనం చేపట్టబోయే కార్యక్రమాల తేదీలను, తీరుతెన్నులను, మన పోరాటం తదుపరి దశ దిశ ఇవన్నీ సమష్టిగా చర్చించి నిర్ణయించుకుందామని పేర్కొన్నారు.

# డిఏవి పబ్లిక్ స్కూల్లో ప్రకృతిలోని నవరసాలు థీమ్‌తో వార్షికోత్సవ వేడుకలు...

**- ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు...**






**కరపత్రం ప్రతినిధి కూకట్పల్లి**
కూకట్ పల్లి లోని డి ఏ వి పబ్లిక్ స్కూల్ లో ప్రకృతిలోని నవరసాలు అనే థీమ్‌తో వార్షికోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి మాజీ ఎమ్మెల్యే జయప్రకాష్ నారాయణతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమంలో విద్యార్థులు గణేశ వందనతో ప్రారంభించి నవరసాల ఆధారంగా డ్యాన్స్, సంగీతం, సాంస్కృతిక ప్రదర్శనలు అద్భుతంగా అందించారు. విద్యార్థుల ప్రతిభకు ప్రేక్షకులు హర్షధ్వానులతో స్వాగతం పలికారు.తరువాత ప్రిన్సిపాల్ జేకబ్ వార్షిక నివేదికను సమర్పించగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడారు. డి ఏ వి విద్యార్థిని విద్యార్థుల ప్రదర్శనల్లో కనిపించిన క్రమశిక్షణ, సృజనాత్మకత అభినందనీయం అన్నారు. పిల్లలు భారత దేశ భవిష్యత్తని గుర్తుంచుకుని వారికి నైతికత, విలువలతో కూడిన విద్యను అందించడం మనందరి బాధ్యత అన్నారు. చివరగా "సే నో టు డ్రగ్స్" అంటూ మాదకద్రవ్యాలకు పిల్లలు చాల దూరంగా ఉండాలని వడ్డేపల్లి సూచించారు. పాఠశాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు వారి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా విచ్చేసినందుకు రాజేశ్వరరావుని స్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# "చంద్రశేఖర్ రెడ్డి"కి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

**కరపత్రం ప్రతినిధి,తూ.గో.జిల్లా అనపర్తి):**





సేవే పరమావధిగా భావించి కష్టాల్లో ఉన్న ఎందరికో అనేక రూపాల్లో ప్రత్యక్షంగా,పరోక్షంగా సహాయం,సేవలందిస్తున్న కోస్తాంధ్ర రెడ్డి యువజన సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి (శేఖర్)"రెడ్డి" సంఘాల స్థాపనకు విశేష కృషి చేశారు. తూర్పుగోదావరి జిల్లా రెడ్డి సంక్షేమ సంఘాన్ని స్థాపించడానికి అనునిత్యం శ్రమించిన రెడ్డి సైనికుడుగా నాటి నుంచి నేటి వరకు ప్రతి కార్యక్రమాన్ని భుజాన వేసుకుని ఆర్గనైజింగ్ సెక్రటరీ గా మొదలుకొని యువజన నాయకుడిగా అంతకు మించి సేవకుడిగా,సమాజ సేవకుడుగా అనేక సంస్థలు ద్వారా సేవలందించారని కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్తి వీర్రెడ్డి తెలిపారు.అంతేకాక అనేక సంస్థల ద్వారా అనేకమందికి అన్నదానం,వైద్యం,విద్యతో పాటు ఎంతో మంది పేదల దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం అందించి మానవతా దృక్పథాన్ని చంద్రశేఖర్ రెడ్డి చాటుకున్నారని వీర్రెడ్డి అన్నారు.ఎన్నో సేవలందిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి "బెస్ట్ సిటిజెన్" వంటి అవార్డు అందుకున్నారు.కాగా చంద్రశేఖర్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి,అధ్యక్షులు కర్రి త్రినాధ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తి వీర్రెడ్డి కోశాధికారి మల్లిడి సూరారెడ్డి, కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు నల్లమిల్లి కాంతం, యువజన సంఘ కార్యదర్శి గుడిమెట్ల కల్కిరెడ్డి, కొప్పవరం రెడ్డి సంఘం అధ్యక్షులు కర్రి విజయ భాస్కర్ రెడ్డి, ఇంకా పలు గ్రామాల రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

# దీక్ష దివాస్ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది...కార్పొరేటర్ రోజా దేవి

**కరపత్రం ప్రతినిధి కూకట్పల్లి**
దీక్ష దివాస్ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందనీ వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ కార్పొరేటర్ రోజా దేవి రంగారావు పేర్కొన్నారు. వివేకానంద నగర్ డివిజన్ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మాధవరం నగర్ కాలనీ డివిజన్ పార్టీ కార్యాలయంలో దీక్ష దివాస్ సందర్భంగా పార్టీ జెండాని స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం గండి మైసమ్మ చౌరస్తాలోని మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంకు కార్యకర్తలతో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రోజా దేవి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకి ఇవాళ శుభకరమైన రోజని తెలంగాణ రాష్ట్ర సాధన ఎన్నో ఏళ్లుగా కష్టపడిన రానీ తెలంగాణను మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ 2001లో పార్టీని స్థాపించి ప్రజల్ని ఏకంచేసి 29 నవంబర్ 2009 దీక్ష చేపట్టి తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అనే నినాదం తోటి ప్రారంభించి పది రోజులు దీక్ష చేయడం వలన ఆరోజు ఉన్నటువంటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణని గత్యంతరం లేని పరిస్థితిలో 9 డిసెంబర్ 2009 నాడు తెలంగాణ నీ ప్రకటించారన్నారు. అలాగే 2 జూన్ 2014 రోజున తెలంగాణను ఏర్పాటు చేసి ప్రజలకు విముక్తి కలిగించిన దాంట్లో కేసీఆర్ విజయం సాధించారని తెలంగాణ ప్రజలు మర్చిపోలేని రోజు అని పేర్కొన్నారు.




ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గొట్టుముక్కల పెద్ద భాస్కరరావు, మాచర్ల భద్రయ్య, వేముల ఆంజనేయులు, శ్రీనివాస్, సత్యనారాయణ, జగదీష్ గౌడ్, రామచందర్, రవీందర్ రావు, నరసింహారెడ్డి, మోహన్ రావు, మల్లయ్య, శేఖర్, బండప్ప, యాదగిరి, ప్రవీణ్, బాబు, విక్రమ్, చిన్న, సోమేష్ ,అరవింద్, రవి, మోహన్ చారి, శ్రీనివాస్, జై, కుమార్, వెంకటేశ్వరరావు, సంతోష్, నవీన్, హరి తదితరులు పాల్గొన్నారు.